

# "మనం మానవులం"

"ఒరే నేను ముందొచ్చాను. నాది సిరి"

"నాది చుక్క"

కాదు నేను ముందొచ్చాను నాదిచుక్క. నీది దెబ్బ

కాదు నాది

ఊ ......

ఒరే మేష్టారొస్తున్నాడు. బిగ్గరగా అనండిరా

కా, కాకు దీర్ఘమిస్తేకా......

కాగ్గుడిస్తేకీ......

కాగ్గుడిస్తేకీ......

పంతులు వచ్చాడు. చామనచాయ విగ్రహం. విభూతిరేకలు మాసినగడ్డం. అల్లరి అణిగిపోయింది; వచ్చి కూర్చున్నాడు.

* * *

"సరస్వతీ నమస్తుభ్యం..."

"ఏమండోయి! మిమ్మల్నే"

వెనక్కి చూచాడు ద్వారందగ్గర ఒక యువతి నుంచుంది. ఆధునికంగా అలంకరణం, చెదరిపోయిన జుట్టు; చేతిలో ముగ్గుబుట్ట.

"ఏం......"

"ఏమా! యింట్లో యేమీలేవు. కూరగాయలు తెప్పించండి"

శ్రీ కనుమూరి వెంకట సుబ్బరాజు

"మొన్ననేగా కొన్నది"

"అట్లాగే ఉన్నాయి."

"పోనీ యివ్వాళ్ల కెల్లాగో చెయ్యి"

"ఏంచేస్తాను యివ్వాళకి! పొయ్యిలో కట్టెలు వు. పొయ్యిమీద కూరాలేదు"

"తెప్పిస్తాను."

"యింకా యెప్పుడు?— తొమ్మిదివేళారు."

"యిదిగో వెళ్లే........"

★

కామయ్యపంతులు కుటుంబం ఆవూళ్ళో చాలా కాలమునుంచీ వుంది. అతనికి దాదాపు 40 యేండ్లు వుంటాయి. ఆయనపెండ్లాం సుందరి. గూపసి. కాని యెప్పుడూ సాదింపే. ఎంత రెండోపెండ్లి అయినా, ఆమె సాదింపు, అతని శాంతంజూచి వూళ్లో ఆశ్చర్య పడనివా రుండరు. అతనికి కొద్దిగా ఆస్తి వుంది.

పరమ ఛాందసుడైన కామయ్యలో ద్వితీయ వివాహం కావలసినంత మార్పు తెచ్చింది. మొదటి భార్య నరసింహన్ని కని చనిపోయింది. యెందు చేతనో నర్సుఅంటే, సుందరమ్మ ప్రేమగా చూస్తూం డేది.

నర్సుకు 8 ఏళ్లుంటాయి

"అమ్మా! నాకు బిస్కత్తులు"

"ఎక్కడివిరా?"

"అదుగో ఆయనపెట్టాడు"

"ఎవరురా?"

"అదిగో ఆమేడమీా దుంటారే! ఆయన!" అని చూపించాడు.

మేడమీాద వున్నది రామారావు. రామారావు ఒక చిరునవ్వు నవ్వాడు అతడు ఎర్రగావుంటాడు క్రీగంటితో అతన్నిచూచి చిరునవ్వు నవ్వింది. "నర్సూ బిస్కత్తులు తీసుకోవచ్చు! "నేను తీసుకోలా, ఆయనే యిచ్చి మీాయమ్మ యేమీా అనదులే అన్నారు."

'పరవాలేదులే తిను, ఇంద' లేచి గట్టిగా ముద్దా డింది. యిదంతా రామారావు చూస్తూనే వున్నాడు.

★

కొద్దిగా సంజచీకటి. కామయ్య పొరుగూరికి యేదోపనిమీాద వెళ్లాడు. నర్సూ,సుందరి పండుకున్నారు. ఆయామాటలు చెప్పుతూ నర్సు త్వరగా నిద్రపోయింది. వెన్నెల కాస్తున్నది. సుందరికి నిద్రరాలేదు. మంచము మీాద అటుయిటు కొట్టుకొన్నది చివరకు కొంచెము సేపు నిశ్చలముగా పండుకొన్నది. మనస్సులో వూహాలు పరుగెత్తుతున్నవి. ప్రపంచమంతా గిర్రున తిరిగింది. ఎప్పుడు తెల్లవారుతుంది? అబ్బా! యిళ్శో...! రామారావు వస్తే. ఛీ, తప్పు, పాపం ఆయన వట్టి అమాయకుడు......చూస్తే తప్పేమి? యిప్పుడుకూడా చూస్తూంటాడేమో-" కొంతసేపు నిట్టు రించు కొన్నది. తరువాత పెరటిలోకి వెళ్లింది. పండు వెన్నెల కాస్తుంది. ఎదుటింటి మేడవైపు చూచింది. అక్కడ గదిలో దీపం వెలుగుతూవుంది. రామా రావు తిరుగుతూవున్నట్లు చూచింది. వెళ్ళి పండు కొందా మనుకొన్నది. సాగలేదు నడక. రామారావు చూచాడు. కళ్లు నలుపుకొని మళ్లీ ఒకసారి చూచాడు. అది రాతిబొమ్మా? మానవాకృతా? చప్పుడు కాకుండా క్రిందికి వచ్చాడు. రెండు అడుగు లలో పెరటి దగ్గరకు వచ్చేశాడు. అంతవరకూ నిశ్చ లంగావున్న సుందరికి కాళ్లు వణకటం ప్రారంభించినయి. పెరట్లోకి వచ్చాడు "సుందరీ ఎన్నిదినాల్నుంచో కాచు కొని వున్నాను. నీకింకా దయరాలేదా? పగలంతా నీమీాదే ధ్యానముంచుకొని ప్రొద్దున సాయంకాలము నిన్నేచూస్తూ రాత్రులు నిన్నే తల్చుకొంటూ, క్షణ మొక యుగముగా గడిపాను సుందరీ......"

"తప్పు! తప్పు! నాపాతివ్రత్యాన్ని భంగం- మీా చదువు-

"ఎక్కడిమాటలు! ఆ ముసలికోతి నీకు మొగుడా? నవ్వుతారు. నువ్వు దగ్గరుంటే, నాకు

ప్రపంచంవద్దు. సుందరి మౌనం దాల్చింది. మౌన మంగీకార సూచకంగా రామారావు సుందరిని తన హ స్తంలో పెనవేసి పెదవులు ముద్దుకొన్నాడు.

★

ప్రక్కవూళ్లో అప్పు వుంటే వసూలు చేసుకు రావటానికి వెళ్లాడు కామయ్య. రాత్రికి తిరిగి వచ్చాడు. ఇల్లంతా కొత్తగా వుంది. ఇంట్లో దీపం లేదు. దీపం వెలిగించాడు. నర్సు పండుకొని వుంది.

"సుందరీ!"...

దొడ్లోకి వెళ్ళిందనుకొని కొంత సేపూర కున్నాడు. మళ్లీ పిల్చాడు జవాబు లేదు దీపం తీసు కొని ఇల్లంతా వెదికాడు. యెక్కడా కనబడ లేదు. పుట్టింటికి అర్ధరాత్రివేళ వెళ్ళిందను కొన్నాడు. బుర్ర గోకుకున్నాడు ఏదో మెరపు మెరిసినట్లైంది హటాత్తుగా మంచం దగ్గర దిండుమీద అతని దృష్టి పడ్డది. అక్కడ కాగితం వుంది.

"నేను మళ్లా తిరిగి రాను..."అది ఆచీటి సారాంశం.

కామయ్య మంచంమీద కూలబడ్డాడు ఒకటి రెండు బిందువులు కళ్ళనుండి జారినై......

★

తెల్లవారుతూ వుంది దగ్గరనున్న దీపం వెల వెల బోతూంది నర్సూ, లే! లే! బండా;"

"అమ్మ! అమ్మ!" చిన్న కూనరాగంగా.

"అమ్మ వూరికెళ్ళింది"...

"ఊ! అమ్మ! ఆ!...

నర్సుని జూసి జాలివేసింది. అతన్ని దగ్గరగా లాక్కొని ప్రక్కన జేర్చుకొని.

"నర్సూ! అమ్మ తాతగారింటికి వెళ్ళింది; రేపు వస్తుంది. మిఠాయి తెస్తుంది."

నర్సు కండ్లు నులుముకొంటూ చిన్న నవ్వుతో ఆమాయికంగా అన్నది "అమ్మ రేపు వస్తుంది నాకు మిఠాయి తెస్తుంది."

★

కార్తీకమాసం. చలిదినాలు. రాత్రి ప్రొద్దు పోయినది. కారు చీకటి నిశ్శబ్దంగా వుంది.

గదిలో మంచంమీద నర్సు పండుకొని వ్ర ప్రక్క.నే. కామయ్య ఏదో పుస్తకం ముందు పెట్టు కొని రెండు చేతులలో తలపెట్టుకొని చూస్తూ కూర్చు న్నాడు. దీపం గంటలా వెలుగుతూవుంది.

"అమ్మ! మరే—"

కామయ్య వులిక్కి పడ్డాడు. ధ్యాన భంగ మైంది. కూతురు వంక చూచాడు. ఒకటి రెండు బొట్లు అతని కంటను జారినవి. మళ్లా ఏకాగ్రతలో పడ్డాడు; చదువుతున్నాడు.

"నేను నీ యింటికి వత్తును. సిద్ధముగా నుం డుము. సర్వసిద్ధముగా నుండుము. అతని జాడ కన బడ లేదు. అంతలో కడజాతి వాడొకడు 'అయ్యా నోరెండుచున్నది' నాయనా, యిదిగో త్రాగుము అని యాతని తృప్తి పరచెను, భగవంతుడు రా లే దు. అంతలో కుక్క యొకటి..."

"పంతులుగారు!..." వీధిలో సన్నని కంఠ స్వరం; కామయ్యకు అంతగా వినబడలేదు.

'అంతలో కుక్కయొకటి వచ్చి పదార్థములు ముట్టుకొనెను. దానిని కొట్టబోయి అత దూరకుండెను తుదకు విసిగి నిద్రపోయెను. కలలో భగవంతుడు కాన్పించినాడు. భక్తుడు చేమోడ్చి 'తండ్రీ! నీకొరకు వేచియుంటిని నీవు రాలేదు. వాత్సల్య పూరితమైన నయనములతో భగవంతుడు, "వత్సా నీ భక్తికి మెచ్చితిని. మాలవానిగను, శునకముగను వచ్చినది నేనేసుమా"! నీవు భక్తులలో నగ్రగణ్యుడవు.'

"పంతులుగారూ!"

యీసారి కొంచెము స్పష్టమైన స్త్రీ కంఠము. కామయ్య లేచి పుస్తకము మూసి తలుపు తెరిచినాడు. ఎదుట స్త్రీ చేతులు జోడించి అయ్యా మీతో మాటాడ దగను. మీ పాదములను ఒకసారి తాకనియ్యండి దానికి కూడా అడుగును.

"నీవెవరవు! చెప్పు, నీకుభయము లేదు లోనికిరా"

"అయ్యా! లోకములో అందరికంటే పాపిని, అనుచూ పాదముల పైబడెను కామయ్య పంతులకు పరమానంద మయ్యింది. జాలిగా సుందరిని లేవనెత్తి "సుందరీ! భయపడకు! లోనికి రా!" అనుచూ సుందరినిలోనికి తీసుకొని వెళ్ళినాడు. సుందరి కళ్ళవెంట అశ్రువులు కారుస్తూ మీకు నేనుద్రోహంచేశా; మీ పాదములు పట్టుకుంటాను. నన్ను చంపివెయ్యండి.

"సుందరీ, యేమిటా మాటలు! వూరుకో! మనమంతా సాధారణ మానవులం. ప్రతివాళ్ళూ తప్పు చేస్తూవుంటారు నామనః పూర్వకంగా నిన్ను క్షమించాను."

సుందరి మాటాడలేదు. ముఖము కప్పుకొని వెక్కి వెక్కి యెడ్వసాగింది.

"సుందరీ! చూడు! తప్పు, యేడవకు, నీవు లేని యిల్లంతా కళావిహీనంగా వుంది. నీ రాక కేవలం లక్ష్మిరాక. చూడు, నర్సు ఎట్లా చిక్కిపోయిందో నిన్నే కలువరిస్తూవున్నాడు 'అమ్మ వస్తుంది మిఠాయి తెస్తుంద'నీ. లే" అని కామయ్య సుందరమ్మను రెండు చేతులు పట్టుకొని లేపి ప్రేమ పురస్సరముగా కౌగలించుకున్నాడు.

"నర్సూ, నాకుపెట్టవురా?"

"దా! ఇంద!"

ఎక్కడనుంచి తెచ్చావురా?

"మాయమ్మ వచ్చింది నాకు మిటాయి తెచ్చింది."

"ఇంకా వుంది?"

కామయ్య పంతులు పెద్ద బుట్ట చేతిలో పట్టుకొని బడిలోకివచ్చాడు 'ఒరే, మీకు రేపు ఆటవిడువు. ఇదిగో అంతా తలా ఒక వుండా తీసుకోండి." పిల్లలంతా గంతులు వేస్తున్నారు. ద్వారం దగ్గర వుండి చూస్తూవున్న సుందరమ్మ కళ్ళవెంట అశ్రువులు అప్రయత్నంగా జారినవి.


## హస్తరేఖాశాస్త్రము.



విశదముగా తెలియగల 300 చిత్రములతోగూడి స్త్రీలు బాలురు సైతము చదువుట కనుకూలించు తేట తెల్లంబగు సాంధ్ర వచనరూపమగు నీగ్రంధము చేత ఆయుస్సు వివాహలాభము, గుణము, శక్తి, బుద్ధి అదృష్టము, సంతానము, లౌకిక సుఖము వ్యాజ్యము. శక్తి ఐశ్వర్యము, గండము, జయము, వ్యాధి, ఋణము, అపాయము, మోసము, జ్ఞానము, దుఃఖము, కార్యసిద్ధి, దయ మరణము మొదలగు ననేక విషయములను సులభముగా దెలిసికొన వచ్చును. ఇంకను, విధిప్రేరణము, జీవిత రహస్యములను తెలియజేయుటకై గల్గు సాధనంబు లన్నింటిలోను యిది యగ్రస్థానంబును వహించియున్నది. భూత భవిష్య ద్వర్తమానంబులని చెప్పబడు త్రికాల వృత్తాంతంబులను దెలియుటకు ఈ గ్రంథము కల్పవృక్షము వంటిదని దీని నామూలాగ్రము ఒక్కమారు చదువువారే చెప్ప సాహసింతురనుట నెంతేయు సందియంబు లేదు. దీని వెల 2-0-0.

సాకారుపేట, ఆనందబోధిని ఆఫీసు. మదరాసు.